కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -177 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 09-07-2026 గురువారం పేజీలు : 4




# ధరణి దందాపై సర్కార్ సీరియస్

- అక్రమాలపై 'సిట్' రంగంలోకి
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో భారీ బహిర్గతం
- అధికారుల లాగిన్లతోనే మార్పులు
- భూ భారతిలోనూ అదే అక్రమాల జాడ
- 40 లక్షల లావాదేవీలపై దర్యాప్తు
- దోషులపై క్రిమినల్ చర్యలకు సిద్ధం
- 'ఎవరినీ వదలొద్దు'.. సీఎం ఆదేశాలు

**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** భూ రికార్డుల నిర్వహణ కోసం గతంలో తెచ్చిన ధరణి పోర్టల్, ఆ తర్వాత వచ్చిన భూభారతిలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తహశీల్దార్ ఆఫీస్ నుంచి సీసీఎల్ఏ కార్యాలయం వరకు ఉద్దేశ్యపూర్వకంగానే రికార్డులు మార్చేశారని ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికల ద్వారా తెలుస్తున్నది. 'తెలియక బటన్ నొక్కాం.. మా తప్పేం లేదు' అంటూ బుకాయిస్తున్న అక్రమార్కుల భరతం పట్టేందుకు సర్కార్ సిద్ధమైంది. ఈ వ్యవహారంపై వారం రోజుల్లో విచారణ కమిటీ తుది నివేదిక ఇచ్చే అవకాశముండగా.. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయనున్నట్లు చర్చ జరుగుతున్నది. మిగతాది 2 లో..

# త్వరలో భారీ పాదయాత్ర

- సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తికి డిమాండ్
- స్కాముల ప్రభుత్వం అంటూ విమర్శలు
- గురుకుల టెండర్లలో స్కామ్ ఆరోపణలు
- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- రేవంత్‌పై హరీష్ ఘాటు వ్యాఖ్యలు


2 లో

# మంత్రి ఫిర్యాదుపై కడియం కౌంటర్

- ఎలాంటి తప్పూ చేయలేదన్న శ్రీహరి
- వినతికి.. సమీక్షకు చాలా తేడా
- వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు
- ఆలయాల అభివృద్ధి కోసమే వెళ్లా
- వివాదాలు సృష్టిస్తున్నారంటూ విమర్శలు


2 లో

**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** మంత్రి కొండాసురేఖ వర్సెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు అధికార కాంగ్రెస్ పార్టీలో మరోసారి భగ్గుమన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దేవాదాయశాఖలో అధికారిక సమీక్ష నిర్వహించారని...మంత్రి కొండా సురేఖ ఆరోపించాడం సంచలనంగా మారింది.కడియం శ్రీహరి 'రూల్స్ ఆఫ్ బిజినెస్' ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ...నేరుగా సి.ఎంకి లేఖ రాయడంతో పాటు ఏఐసీసీ పెద్దలకు సైతం ఫిర్యాదు చేయడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది.

# నువ్వు లేవనే వార్త నన్ను బాధిస్తోంది


2 లో

- ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను'
- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి
- ధైర్యవంతుడైన చిన్నారికి నివాళి

# వారంతా చనిపోయారు


2 లో

- ఆరుగురు జాలర్లు మృతి చెందినట్లే
- ప్రభుత్వానికి కమిటీ నివేదిక
- మూడు రోజుల గాలింపు ఫలించలేదు
- బోటు ప్రమాదంపై విషాద ముగింపు
- బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల సాయం
- ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందజేత

# 'ప్రశ్న రావణ్' ఫోన్‌లో అశ్లీల వీడియోలు


2 లో

- ఫోరెన్సిక్ నివేదికలో షాకింగ్ నిజాలు
- ఫోన్‌లో అశ్లీల వీడియోల వెలుగులోకి
- 10 మంది బాధితుల గుర్తింపు
- బ్లాక్‌మెయిల్ కోణంలో దర్యాప్తు
- డిజిటల్ ఆధారాలతో విచారణ వేగం
- బాధితుల వాంగ్మూలాల నమోదు సిద్ధం

# తాడిచెర్ల-2పై భట్టి కౌంటర్


2 లో

- కొత్తగా చేసిందేంటని ప్రశ్న
- కొట్లాడి అనుమతులు తెచ్చుకున్నాం
- వాస్తవాలు దాస్తున్నారంటూ విమర్శలు
- బీజేపీ-కాంగ్రెస్ మధ్య కోల్ వార్
- సింగరేణికే అన్ని గనులు ఇవ్వాలి

**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** తెలంగాణ రాజకీయాల్లో తాటిచెర్ల కోల్ బ్లాక్-2 విషయంలో వార్ మొదలైంది. తాడిచెర్ల-2 కోల్ సింగరేణి కి కేటాయించామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే తాటిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందని బీజేపీ చేస్తున్న వాదనను భట్టి ఖండించారు. దీంతో తాజాగా కోల్ బ్లాక్ పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య కోల్డ్ వార్ మొదలైంది.

కొత్తగా మీరు చేసిందేంటి?: బుధవారం మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క. సింగరేణికి తాడిచర్ల-2 కేటాయింపు సంతోషకరం అని కానీ కిషన్ రెడ్డి వాస్తవాలు దాస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలను మరుగునపరిచి తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ఈ బ్లాక్?ను 2013లో నాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణి కాలరీస్ కు కేటాయించిందని ఇందులో బీజేపీ ప్రభుత్వం కొత్తగా అలాట్ చేసిందేంటని ప్రశ్నించారు. అయితే గతంలోనే కేటాయిస్తే 2013 నుంచి ఇప్పటి వరకు పెండింగ్ పెట్టారన్నారు. బ్లాక్ కేటాయింపు జరిగింది.. మైనింగ్ లీజు కోసం అనుమతి ఇవ్వలేదన్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

## ఇక చర్చలే లేవన్న అమెరికా

- ట్రంప్ వ్యాఖ్యలతో ప్రపంచం ఉలిక్కి
- మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి
- మార్కెట్లలో భారీ కుదుపు
- ముడిచమురుకు మళ్లీ రెక్కలు


2 లో

# పుణెలో చెత్త గుట్ట బీభత్సం

- చెత్తకుప్ప జారిపడి ఘోర ప్రమాదం
- కుప్పకూలిన మూడంతస్తుల భవనం
- శిథిలాల కింద 16 మంది
- నలుగురిని సురక్షితంగా రక్షించిన బృందాలు


2 లో

**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** పుణె సమీపంలోని పింప్రి చించ్వాడ్‌లో బుధవారం ఊహించని ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఎడతెరిపి లేని భారీ వర్షాల ధాటికి కొండంత ఉన్న ఓ భారీ చెత్తకుప్ప జారిపడి.. పక్కనే ఉన్న మూడు అంతస్తుల పరిపాలనా భవనంపై పడింది. దీంతో ఆ భవనం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో సుమారు 15 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకున్నట్లు స్థానికుల సమాచారం. మోషీ ప్రాంతంలోని పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాసెసింగ్ ప్లాంట్ వద్ద ఈ ఘటన జరిగింది.

ఎలా జరిగింది..?

బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో వర్షాల వల్ల చెత్తకుప్ప వదులై పక్కనే ఉన్న ఆఫీస్ భవనంపై కుప్పకూలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

# పరవళ్లు తొక్కుతున్న గోదావరి

## ధవళేశ్వరం వద్ద నిండుకుండను తలపిస్తోన్న నది


2 లో

# పీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం తీపికబురు

- రూ.5 లక్షల వరకు ఆటో క్లెయిమ్
- వేగంగా క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్
- ఒకే డేటాబేస్‌లో పీఎఫ్ వివరాలు
- నేటి నుంచే కొత్త వ్యవస్థ అమలు
- త్వరలో ఖాతాల్లో పీఎఫ్ వడ్డీ జమ

2 లో

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

## ఇక చర్చలే లేవన్న అమెరికా



**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** ఇరాన్ తో యుద్ధంపై డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇటీవలే ఇరుదేశాలు స్విట్జర్లాండ్ లో శాంతి ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీనిపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో 2026 సదస్సు వేదికగా .. ఇరాన్ పై విమర్శలు చేశారు. ఇరాన్ క్షమించరాని తప్పులు చేస్తోందన్న ట్రంప్.. శాంతి ఒప్పందం ముగిసిందని, ఇకపై ఇరాన్ తో ఎలాంటి చర్చలు జరపబోమని, ఆ చర్చలు జరపడం కూడా సమయం వృథా అని కుండబద్దలు కొట్టారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు.. అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనం రేపాయి. నాటో చీఫ్ మార్క్ రుట్టెతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఇరాన్ తో కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పంది పూర్తిగా రద్దయినట్లేనా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. నా ఉద్దేశంలో ఇది ముగిసిపోయిందని బదులిచ్చారు. పైగా ఇరానియన్లతో ఇకపై ఎలాంటి చర్చలు జరపాలనుకోవడం లేదని, వారు చాలా కఠినమైన, హింసాత్మకమైన మనస్తత్వంతో ఉన్నారని, వారిని నడిపించే నాయకులు కూడా అలాగే ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కాగా.. ట్రంప్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. సెన్సెక్స్ 1500 పాయింట్లు, నిఫ్టీ 467 పాయింట్లు నష్టాల్లోకి వెళ్లాయి. మరోవైపు ముడిచమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్యారెల్ ముడిచమురు ధర 2 శాతం పెరిగింది. బుధవారం మధ్యాహ్నానికి బ్యారెల్ ముడిచమురు ధర 78.73 డాలర్లకు ఎగబాకింది. మళ్లీ హార్ముజ్ జలసంధి వద్ద నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందేమోనని ప్రపంచ దేశాల మధ్య భయాలు మొదలయ్యాయి.

ఇరాన్ పై మంగళవారం రాత్రి అమెరికా జరిపిన భారీ వైమానిక దాడుల అనంతరం ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం మళ్లీ మొదటికి వచ్చింది. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ సైతం బహ్రెయిన్, కువైట్ తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై సరికొత్త రాకెట్ దాడులకు దిగింది. ఈ దాడులపై స్పందించిన ట్రంప్.. గత రాత్రి ఇరాన్ లోని కొన్ని శక్తులపై దాడులు నిర్వహించామని, గల్ఫ్ ప్రాంతంలో నౌకలపై ఇరాన్ రాకెట్ దాడులకు దిగడం వల్లనే తాము తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.

# మంత్రి ఫిర్యాదుపై కడియం కౌంటర్

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఫిర్యాదుపై కడియం శ్రీహరి స్పందించారు. ప్రజల మధ్య లేనివాళ్లు.. కాంట్రవర్సీలతో లైమ్‌లైట్ లో ఉండేందుకు ప్రయత్నం చేస్తుంటారని, తమశాఖ అధికారులకు తమకు తెలియకుండా కలవడమేంటి అని ప్రశ్నించడం అవివేకం అన్నారు.

ఎవరికి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు:

మంత్రి తనను తప్పుగా అర్థం చేసుకున్నారని తాను ఎలాంటి తప్పు చేయలేదని ఈ విషయంలో వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఒక ప్రజాప్రతినిధిగా ఏ అధికారినైనా కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చే హక్కు తనకు ఉందన్నారు. అదే కోవలా తాను తన నియోజకవర్గానికి సంబంధించిన దేవాలయాల అభివృద్ధి గురించి తాను సంబంధిత శాఖ అధికారుల వద్దకు వెళ్లానన్నారు. అధికారులను తన వద్దకు పిలిపించుకోలేదని తానే అధికారుల వద్దకు వెళ్లాలని చెప్పారు. అభివృద్ధిని పట్టించుకోని వారే వివాదాలు సృష్టిస్తున్నారని, తాము సమీక్షలు చేయలేదని, కేవలం ఆలయాల అభివృద్ధి కోసమే దేవాదాయ శాఖ కార్యాలయానికి వెళ్లానని స్పష్టం చేశారు. సమీక్షకు, సమస్యలపై వినతి పత్రం ఇవ్వడానికి చాలా తేడా ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం సమీక్ష కేవలం మంత్రులు, కేబినెట్ ర్యాంక్ ఉన్న వారు మాత్రమే చేయగలరు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సమీక్షల్లో పాల్గొంటారన్నారు. నా పనులు నేను చేసుకుంటూ వెళ్తుంటే ఇలా మాట్లాడం బాధేస్తుందన్నారు. ఇది మంచి పరిణామం కాదన్నారు. నేను ఎక్కడ తప్పు చేయలేదని నేను ఎవరికి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మాకు తెలియకుండా మా శాఖ అధికారుల వద్దకు వెళ్లొద్దనడం నేను ఎక్కడా వినలేదన్నారు.

# నువ్వు లేవనే వార్త నన్ను బాధిస్తోంది

## నిరంజన్ మృతిపై పవన్ ఎమోషనల్ పోస్ట్

**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ వీరాభిమాని హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ బుధవారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఈ నేపథ్యంలో ఆయన మృతిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్విట్టర్ వేదికగా ఎమోషనల్ పోస్ట్ చేశారు. ఇటీవల హనుమకొండలోని నిరంజన్ నివాసానికి స్వయంగా వెళ్లి, ఆ చిన్నారిని పరామర్శించిన క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆ విడుదల చేసిన ప్రకటన అందరినీ కన్నీళ్లు పెట్టిస్తోంది.

నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అతడి ఇంటికి వెళ్లి కలిసిన ఆ క్షణాలు ఇంకా నా మదిలో సజీవంగానే ఉన్నాయని తెలిపారు. తీవ్రమైన అనారోగ్యంతో పోరాడుతూనే తన కోసం ఎదురుచూసిన ఆ చిన్నారి.. తనను చూడగానే అతడి ముఖంపై విరిసిన ఆ చిరునవ్వు.. ఇవన్నీ ఎప్పటికీ మరువలేని జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని పవన్ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు.

అంతులేని ధైర్యం.. కలచివేస్తున్న జ్ఞాపకాలు

చిన్నారి నిరంజన్ వ్యాధితో పోరాడినా, అతడి మనసు మాత్రం అపారమైన ధైర్యంతో నిలిచిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అంతటి బాధను అనుభవిస్తూ కూడా జీవితం పట్ల అతను చూపిన ఆశ, ఆత్మవిశ్వాసం ఎంతో విలువైనవని కొనియాడారు. అలాంటి ధైర్యవంతుడైన చిన్నారి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నిరంజన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని పవన్ తెలియజేస్తూ, వారికి ఈ తీరని దు:ఖాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. 'ప్రియమైన నిరంజన్.. నువ్వు చూపించిన చిరునవ్వు, ధైర్యం, నువ్వు పంచిన ప్రేమ నా హృదయంలో ఎప్పటికీ నిలిచిపోతాయి. నీ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అంటు పవన్ చేసిన ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# వారంతా చనిపోయారు

## మత్స్యకారుల గల్లంతుపై ప్రభుత్వానికి నివేదిక

**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** జులై 4వ తేదీన చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తున్న మత్స్యకారుల బోటు గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాద సమయంలో బోటులో ఏడుగురు మత్స్యకారులుండగా.. ఒక మత్స్యకారుడు మాత్రమే బోటును పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు. సముద్రంలో గల్లంతైన మరో ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్టుగార్డులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మూడు రోజులుగా తీవ్రంగా గాలించినా.. ఫలితం లేకపోయింది. ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ దొరక్కపోవడంతో.. ప్రభుత్వానికి త్రిసభ్య నిజనిర్ధారణ కమిటీ నివేదిక సమర్పించింది. గల్లంతైన ఆరుగురు జాలర్లు మృతి చెందినట్లుగా నిర్ధారిస్తున్నట్లు నివేదికలో పేర్కొంది. కాగా.. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారమే ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు తక్షణ సాయంగా ప్రకటించగా.. మంత్రి కొల్లు రవీంద్ర ఆ చెక్కుల్ని బాధిత కుటుంబాలకు అందజేశారు.

# 'ప్రశ్న రావణ్' ఫోన్‌లో అశ్లీల వీడియోలు



**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లపై అనుచిత వ్యాఖ్యాల నేపథ్యంలో వివిధ కేసుల్లో అరెస్ట్ అయిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసెఫ్ అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగు చేస్తున్నాయి. తాజాగా అతడి మొబైల్ ఫోన్‌కు సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక రావడంతో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. రావణ్ తన మొబైల్ ఫోన్ ద్వారా అమాయక యువతులను తీవ్రంగా వేధించినట్లుగా బలమైన ఎవిడెన్స్‌లు లభ్యమయ్యాయి. ఫోరెన్సిక్ ల్యాబ్ రికవరీ చేసిన డేటా ప్రకారం.. నిందితుడు అశ్లీల వీడియోలను ఉపయోగించి పలువురు యువతులను లైంగికంగా, మానసికంగా వేధించినట్లుగా సమాచారం అందుతోంది.

రంగంలోకి పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం

ప్రశ్న రావణ్ ఫోన్ నుంచి లభించిన డిజిటల్ డేటా ఆధారంగా పోలీసులు ఇప్పటివరకు సుమారు 10 మంది బాధితులను గుర్తించినట్లుగా తెలుస్తోంది. నిందితుడు వారి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడి అలా ఎంతమందిని వేధించాడనే కోణంలో పోలీసులు విచారణను మరింత వేగవంతం చేశారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచి, వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# "త్వరలో భారీ పాదయాత్ర

**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** సంగారెడ్డి ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం త్వరలోనే తాను సంగమేశ్వర-బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ భారీ పాదయాత్ర చేపడతానని మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటించారు. జిల్లాలోని ప్రధాన నీటి వనరు అయిన సింగూరు ప్రాజెక్టులో ఉన్న నీళ్లన్నింటినీ ప్రభుత్వం ఖాళీ చేసిందని ఆరోపించారు. రైతులకు క్రాప్ హాలిడే (పంట విరామం) ప్రకటించి కూడా వారికి ఇవ్వాల్సిన కనీస పరిహారాన్ని అందజేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న పంటల బీమా పథకం పూర్తిగా తుస్సు అయిందని ఎద్దేవా చేశారు. గత రెండేళ్లుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారని, ఇలా పథకాలు అమలు చేయకుండా ఇందిరమ్మ పేరును కాంగ్రెస్ నాయకులే చెడగొడుతున్నారని విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేశారని హరీష్ రావు దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న స్కాముల ప్రభుత్వం పోయి.. ప్రజలకు మేలు చేసే స్కీముల ప్రభుత్వం తిరిగి రావాలని జనం బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. రేపు భూమి బద్దలైనా, రేవంత్ రెడ్డి తలకిందులుగా తపస్సు చేసినా, ఆఖరికి భూకంపం వచ్చినా సరే.. తెలంగాణలో మళ్లీ వచ్చేది కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ.. ప్రభుత్వ గురుకుల పాఠశాలల టెండర్లలో ముగ్గురు కాంగ్రెస్ మంత్రులు కలిసి భారీ స్కామ్‌కు పాల్పడ్డారని హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ అవినీతి విషయంపై నిలదీసేందుకు, అధికారులను కలిసేందుకు తాము వెళ్తుంటే.. రేవంత్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని తమ్ము దారుణంగా అడ్డుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలు చేయడంపై హరీష్ రావు స్పందించారు. "సహజంగా పొట్టిగా ఉన్నోడికి.. పొడుగ్గా ఉన్నోడిని చూస్తే కొంత ఈర్ష్య, అసూయ ఉంటాయి. అందుకే రేవంత్ రెడ్డి ఎప్పుడు మాట్లాడినా నా ఎత్తు (హైట్) గురించే మాట్లాడుతుంటాడు" అంటూ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అబద్ధాలు చెప్పినా, తెలంగాణలోని ప్రతి గ్రామంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయని హరీష్ రావు స్పష్టం చేశారు.

# పీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం తీపికబురు





**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** దేశంలోని కోట్ల మంది ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పీఎఫ్ విత్‌డ్రా ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ లో విప్లవాత్మక మార్పులను ప్రవేశపెట్టింది. ఇకపై ఎలాంటి ఆలస్యం లేకుండా రూ.5 లక్షల వరకు ఉండే పీఎఫ్ క్లెయిమ్‌లను ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్ పద్ధతి ద్వారా ఆటోమేటిక్‌గా ఆమోదించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, అందుకు సంబంధించిన ఈపీఎఫ్‌వో కొత్త డిపాజిట్ వ్యవస్థ నేటి నుంచే అధికారికంగా ప్రారంభమైంది.

ఒకే డేటాబేస్.. మరింత వేగంగా పీఎఫ్ సేవలు

అయితే, కొత్తగా చేపట్టిన టెక్నికల్ మార్పుల వల్ల ఇక నుంచి పీఎఫ్ సేవలు శరవేగంగా సాగనున్నాయి. ఇది వరకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌కు వారాల తరబడి వేచి చూడాల్సి రాగా.. ఇకపై రోజుల్లోనే పని పూర్తి కానుంది. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులందరి పీఎఫ్ వివరాలను ఒకే కేంద్రీకృత డేటాబేస్ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో ఉద్యోగులు దేశంలో ఎక్కడి నుంచైనా తమ పీఎఫ్ వివరాలను ఒకే చోట సులభంగా చూసుకోవచ్చు. జూలై 15 నాటికి ఖాతాల్లో జమ అయిన మొత్తానికి ప్రభుత్వం అందించే పీఎఫ్ వడ్డీ జమ చేసే ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది.

# పుణెలో చెత్త గుట్ట బీభత్సం



**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** పుణె సమీపంలోని పింప్రి చించ్వాడ్‌లో బుధవారం ఊహించని ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఎడతెరిపి లేని భారీ వర్షాల ధాటికి కొండంత ఉన్న ఓ భారీ చెత్తకుప్ప జారిపడి.. పక్కనే ఉన్న మూడు అంతస్తుల పరిపాలనా భవనంపై పడింది. దీంతో ఆ భవనం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో సుమారు 15 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకున్నట్లు స్థానికుల సమాచారం. మోచీ ప్రాంతంలోని పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాసెసింగ్ ప్లాంట్ వద్ద ఈ ఘటన జరిగింది.

ఎలా జరిగింది..?

బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో వర్షాల వల్ల చెత్తకుప్ప వదులై పక్కనే ఉన్న ఆఫీస్ భవనంపై కుప్పకూలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ తరపున చెత్తను ప్రాసెస్ చేస్తున్న ఓ ప్రైవేటు కంపెనీ ఉద్యోగులు ప్రమాద సమయంలో భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రమాద సమయంలో భవనంలో మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం. వీరిలో ఇప్పటివరకు నలుగురిని సురక్షితంగా రక్షించినట్లు తెలిసింది.

ముమ్మరంగా సహాయక చర్యలు..

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. సహాయక చర్యల కోసం ఆర్మీ రంగంలోకి దిగింది. మేయర్ రవి లాండ్గే, మున్సిపల్ కమిషనర్ విజయ్ సూర్యవంశీ, పోలీస్ కమిషనర్ వినోయ్ కుమార్ చౌబే స్వయంగా ఘటనా స్థలంలో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ధరణి దందాపై సర్కార్ సీరియస్

మొదటి పేజీ తరువాయి

ఫోరెన్సిక్ ఆడిట్‌తో..: ధరణి పోర్టల్ లెగసీ కోడ్ ను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో కంటిన్యూ చేయాల్సి వచ్చింది. అయితే ఒక్కొక్కటిగా లోపాలు బయటపడుతుండడంతో ధరణి ఆర్కిటెక్చర్ ను భూ భారతి చట్టానికి అనుగుణంగా మార్చుకొని సర్దుబాటు చేస్తూ వచ్చారు. పాత ఆర్కిటెక్చర్ లో అనేక పొరపాట్లు కనిపించగా.. ఫోరెన్సిక్ ఆడిట్ లో అక్రమాల చిట్టా బయటపడింది. భూ భారతి చట్టం, రూల్స్ కికు అనుగుణంగా ఎన్ఐసీ ఆధ్వర్యంలో కొత్త వెబ్ సైట్ రూపొందిస్తున్నారు. ఈ క్రమంలోనే పాత ఆర్కిటెక్చర్ లోని లోపాలను అధ్యయనం చేయడానికే కమిటీ పని చేస్తున్నట్లు ఓ అధికారి 'దిశ'కు వివరించారు. కొత్త వెబ్ పోర్టల్ ను రూపొందించే వరకు రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లను నిలిపివేయలేమని, అందుకే పాత ఆర్కిటెక్చర్ ను కొనసాగించాల్సి వస్తుందని చెప్తున్నారు.

బయటపడకుండా అడ్డగింత: సాఫ్ట్ వేర్ అదే కావడంతో ధరణి అక్రమాలు భూ భారతిలోనూ కంటిన్యూ అయ్యాయి. అయితే ఇవి బయటపడకుండా కొందరు అక్రమార్కులు అడ్డుకుంటున్నారు. 'అయ్యో.. అనుకోకుండా ప్రెస్ అయ్యింది.. కావాలని చేయలేదు.' ఇలాంటి కారణాలతో తప్పులను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. తహశీల్దార్ కార్యాలయంలోని భూ భారతి/ధరణి ఆపరేటర్ మొదలుకొని కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయం వరకు అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇవన్నీ ఉద్దేశ్యపూర్వకంగానే చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. చెక్ లిస్ట్ ప్రకారం చేయాల్సిన సందర్భాల్లో అవేవీ లేకుండానే క్లియరెన్స్ చేశారు. వారి స్క్రీన్ లోనే దర్శనమిచ్చే డేటానే మార్చేశారు.

ఉద్దేశ్యపూర్వకంగానే: ధరణి, భూ భారతి పోర్టల్ ద్వారా చోటు చేసుకున్న అక్రమాలన్నీ అధికారుల ఐడీ ద్వారా లాగిన్ అయి చేసినవేనని ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ధరణి, భూ భారతి అక్రమాలపై వేసిన కమిటీ కూడా ఇలాగే ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. సిస్టంను హ్యాక్ చేసి, సర్వర్ ను టచ్ చేసేంత టెక్నికల్ సపోర్ట్ కలిగిన వ్యక్తులు చేసిన పనులు కాదని నిర్ధారించారు. లాగిన్, లాగ్ అవుట్.. ఈ మధ్య ప్రతి అప్ డేట్ లోనూ చెక్ లిస్ట్ చేయాల్సిన బాధ్యత అధికారులదే. అది లేకుండానే ల్యాండ్ డిటెయిల్స్ అప్ డేట్, చేంజెస్ జరిగిపోయాయి. కానీ ఇప్పుడేమో తప్పించుకోవడానికి కారణాలు చెప్తున్నట్లు తెలిసింది.

కోడ్ ఆడిట్..: ధరణి పోర్టల్ ను టెర్రాసిస్ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఎన్ఐసీకి అప్పగించింది. ఈ క్రమంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు, కోడ్ లో పొరపాట్లు లేవని టెర్రాసిస్ నిర్ధారించిందని అధికారులు అంటున్నారు. అంటే ఈ ఇల్లీగల్ ఎంట్రీస్, చేంజెస్ ను హిస్టరీ ఆధారంగా గుర్తించొచ్చు. దీంతో ఇప్పుడు కోడ్ ఆడిట్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రతి సంవత్సరం సెక్యూరిటీ ఆడిట్ మాత్రమే చేస్తున్నారు. సీడాక్ ద్వారా ఈ ప్రక్రియ నడుస్తుంది. ఐతే కోడ్ ఆడిట్ ఎప్పుడూ చేయలేదు. ఇది చేస్తే చిన్న చిన్న లోపాలు కూడా బయటపడుతాయి. సుమారు 40 లక్షల ట్రాన్సాక్షన్లలో ఎన్ని పొరపాట్లు ఉన్నాయో గుర్తించే ప్రక్రియ నడుస్తుంది. భవిష్యత్తులో తప్పులు రిపీట్ కాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి కూడా కమిటీ చర్చిస్తున్నది. కొత్త పోర్టల్ రూపొందించేటప్పుడు ధరణి కోర్సు ఓ స్టడీగా మారింది.

భూ భారతిలోనూ అక్రమాలు అనేకం: ధరణి పోర్టల్ లోని లోపాలు, సాఫ్ట్ వేర్ ను ఆసరాగా చేసుకొని ఎక్కడి నుంచైనా, ఎవరి లాగిన్ నుంచైనా చేంజెస్ చేసుకున్నారు. భూ భారతిలోనూ అదే పరంపర కొనసాగింది. ప్రస్తుతం కమిటీ నాలుగు రకాలుగా విశ్లేషిస్తున్నది. సిస్టమ్ ని హ్యాకింగ్ చేశారా? సర్వర్ ని అటాక్ చేశారా? అమాయకులైన ఆపరేటర్లు, అధికారులు చేశారా? ఉద్దేశ్యపూర్వకంగానే ఫ్రాడ్ చేశారా? ఇందులో ఫ్రాడ్ ద్వారా ఎన్ని జరిగాయి. వాటిలో క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఎన్ని ఉన్నాయి? ఆ అక్రమాలు ఎన్ని రకాలు? వీటిని అనలైజ్ చేసే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. అయితే ఈ అక్రమాలపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ గా ఉన్నారు. ఎవరినీ వదిలిపెట్టొద్దన్న సూచనలు ఇచ్చినట్లు ఓ అధికారి తెలిపారు.

సెక్యూరిటీ ఆడిట్ టైంలోనూ: టెర్రాసిస్ నుంచి ఎన్ఐసీకి పోర్టల్ డేటా బదిలీ చేసినప్పుడు సెక్యూరిటీ ఆడిట్ చేశారు. ఈ క్రమంలోనే ఆధార్ ఎన్ క్రిప్షన్ చేశారు. దాంతో లోపాలు బయటపడ్డాయి. రిపేర్ చేయగా కొంత కాలం బాగానే పని చేసింది. ఆ తర్వాత పోర్టల్ లో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ధరణి పోర్టల్ వైఫల్యానికి, స్లో కావడానికి, స్లాట్స్ బుక్ కాకపోవడానికి వందకుపైగా కారణాలను గుర్తించారు. ఐతే అప్పటి నుంచి కొత్త వెబ్ సైట్ ను రూపొందించకుండా కంటిన్యూ చేయడంతో అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

బాధ్యులను గుర్తించేందుకు సిట్: ఎన్ఐసీ రూపొందించిన భూ భారతి పోర్టల్ కూడా ధరణి ఆధారిత టెక్నాలజీ కావడంతో లోపాలకు అవకాశం ఉంది. ధరణి పోర్టల్ ద్వారా మాడ్యూల్స్ రూపొందించిన వ్యక్తులే దీని వెనుక ఉన్నట్లుగా ప్రభుత్వం అనుమానించింది. ఈ నేపథ్యంలో బాధ్యులను గుర్తించడం, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ప్రారంభించడం, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు సూచించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. మరో వారం రోజుల్లో కమిటీ రిపోర్ట్ ఇవ్వనున్నది. ఐతే అక్రమాలపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# పరవళ్లు తొక్కుతున్న గోదావరి

## ధవళేశ్వరం వద్ద నిండుకుండను తలపిస్తోన్న నది



**న్యూస్ డెస్క్, 08 జూలై (బిఎన్ఎస్):** వేసవిలో నదిలో నీరు లేక ధవళేశ్వరం వద్ద వెలవెలబోయిన గోదావరి.. ప్రస్తుతం ఎగువన కురుస్తోన్న వర్షాలతో జలకళ సంతరించుకుంది. రాజమండ్రిలో ఉన్న ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నది నిండుకుండలా కనిపిస్తోంది. గోదావరికి క్రమంగా వరద పెరుగుతుండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం వద్ద గోదావరి నది మునుపెన్నడూ లేనిరీతిలో సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. ఎగువ నుంచి వస్తోన్న కొత్తనీరు నది నీటిలో కలుస్తుండగా.. నీలి, ఎరుపు రంగులతో గోదావరి కనువిందు చేస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు, స్థానికులు నదీతీరం వద్దకు చేరుకుంటున్నారు.

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నది నీటిమట్టం గంటగంటకు పెరుగుతుండటంతో అధికారులు అలర్టయ్యారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరగా.. ఎగువ నుంచి ధవళేశ్వరం బ్యారేజీకి 60,933 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీ నుంచి ఔట్ ఫ్లో 57,387 క్యూసెక్కులుగా ఉండగా.. 13,600 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదులుతున్నారు. బ్యారేజీ గేట్లను ఎత్తి 43,387 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. గోదావరి జలకళ సంతరించుకోవడంతో.. రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తాడిచెర్ల బ్లాక్-2 పై భట్టి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి



తెలంగాణపై ప్రేమ ఉండే ఆ పని చేయండి: కొత్త యాక్ట్ ప్రకారం తాడిచర్ల -2 సింగరేణికి ఇవ్వబోమని చెప్పారు. కానీ యాక్ట్ రావడానికి ముందే సింగరేణికి తాడిచర్ల-2 కేటాయించారనే ఈ విషయాలను మేము అధికారంలోకి వచ్చాక ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి వాస్తవాలను వారి ముందు ఉంచామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొట్లాడి అనుమతులు తెచ్చిందని ఇప్పటికైనా అనుమతులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణపై నిజంగా బీజేపీకి ప్రేమ ఉంటే సింగరేణి పరిధిలోని గనులన్నీ సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

# ట్రాఫిక్ రద్దీ నివారణకు సమగ్ర సర్వేలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలి: జాయింట్ సీపీ సన్ ప్రీత్ సింగ్



సైబరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు డేటా ఆధారిత కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో, శేరిలింగంపల్లి ట్రాఫిక్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్ ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జాయింట్ సీపీ మాట్లాడుతూ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు సమగ్ర డేటా ఆధారిత సర్వేలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వివిధ కంపెనీల నుంచి ఏయే సమయాల్లో ఎన్ని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయనే అంశాలపై వారం రోజుల పాటు రోజు వారీగా, సమయాల వారీగా వాహనాల లెక్కింపు చేపట్టాలని ఆదేశించారు. ఈ సర్వే ద్వారా ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ తీవ్రతపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపారు.

ఐటీ కారిడార్ ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్‌పూలింగ్‌ను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, వాహనాల వర్గీకరణ, ట్రాఫిక్ వాల్యూం, రహదారుల సామర్థ్యంపై సమగ్ర విశ్లేషణ నిర్వహించాలని అధికారులకు తెలిపారు.

ప్రధాన కూడళ్లు (జంక్షన్లు), ముఖ్య రహదారుల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును సమీక్షించి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. కెమెరాల జియో-ట్యాగింగ్, హై-రిజల్యూషన్ కెమెరాల అవసరం, సిగ్నల్ అబ్స్ట్రాక్ట్‌లు, పెలికాన్ సిగ్నల్స్, జంక్షన్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.

అలాగే షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను అధ్యయనం చేసి, రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యాసంస్థల ప్రారంభ, ముగింపు సమయాల్లో విద్యార్థులు ఏ విధంగా ప్రయాణిస్తున్నారు, ట్రాఫిక్‌పై దాని ప్రభావం ఎలా ఉందనే అంశాలను కూడా విశ్లేషించాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ సీపీ సూచించారు.

ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ డీసీపీ రవికుమార్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ హనుమంతరావు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ అడ్మిన్ నరేందర్, ఎస్ సీ ఎస్ సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య అరెస్ట్

## ; మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



మియాపూర్ (సైబరాబాద్): అక్రమ సంబంధానికి అడ్డంగా ఉన్నాడనే నెపంతో, ఆస్తి కోసం ఓ భార్య తన ప్రియుడు, మరో సహాయకుడితో కలిసి భర్తను అత్యంత దారుణంగా హత్య చేసిన ఉదంతాన్ని మియాపూర్ పోలీసులు ఛేదించారు. మియాపూర్‌కు చెందిన వ్యాపారస్తుడు మల్లాని పెంటేష్ (57) గతేడాది నవంబర్ నుండి కనిపించడం లేదంటూ అతని భార్య మల్లాని సత్యావతి (47) ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు మొదట మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే, పోలీసుల లోతైన దర్యాప్తునకు భయపడి బుధవారం (08-07-2026) నిందితులు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవడంతో ఈ దారుణ హత్య ఉదంతం వెలుగుచూసింది.

పోలీసుల కథనం ప్రకారం.. భార్య సత్యావతికి సంగారెడ్డికి చెందిన వ్యాపారి మర్రి మధుసూదన్ రెడ్డి (47) తో అక్రమ సంబంధం ఉంది. భర్తను వదిలించుకొని ఆస్తి దక్కించుకోవాలనే ప్లాన్‌తో, గతేడాది నవంబర్ 18 రాత్రి సత్యావతి తన భర్త భోజనంలో నిద్రమాత్రలు కలిపింది. పెంటేష్ స్పృహ కోల్పోయాక, సత్యావతి, ప్రియుడు మధుసూదన్ రెడ్డి, అతని స్నేహితుడు దిద్ది రాజేష్ కుమార్ (47) కలిసి దిండుతో ముఖంపై నొక్కి పెంటేష్‌ను ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం శవాన్ని ఎక్స్-యూ-వీ 500 కారులో మహారాష్ట్రలోని నల్దుర్గ్ పోలీస్ స్టేషన్ పరిధికి తరలించి, పెట్రోల్ పోసి దహనం చేశారు. ఆపై ఏమీ తెలియనట్టు నవంబర్ 25న భర్త కనిపించడం లేదంటూ సత్యావతి పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసింది.

నిందితుల లొంగుబాటుతో పోలీసులు కేసును హత్య కేసుగా మార్చి ముగ్గురినీ (ఏ1 నుండి ఏ3) అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలో లభ్యమైన సగం కాలిన గుర్తుతెలియని శవం పెంటేష్‌దేనని, అక్కడి పోలీసులు భద్రపరిచిన డీఎన్ఏ ఆధారాల ద్వారా ధృవీకరించుకున్నారు. నిందితుల నుండి శవాన్ని తరలించిన కారు, 5 మొబైల్ ఫోన్లు, 4 తులాల బంగారు గొలుసు మరియు రూ. 2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మియాపూర్ సీఐ జి. రమేష్ నాయుడు, ఎస్ఐల బృందం ఈ క్లిష్టమైన కేసును విజయవంతంగా ఛేదించింది.

# జేఎన్‌టీయూ, కూకట్‌పల్లి వై జంక్షన్‌లతో పాటు గచ్చిబౌలి వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించిన జాయింట్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వర్షాకాలంలో ఇబ్బందులు నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు జాయింట్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచన**



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ నివారణ, ట్రాఫిక్ ప్రవాహాన్ని మరింత సులభతరం చేయడం, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టడం లక్ష్యంగా జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్., బుధవారం జేఎన్‌టీయూ జంక్షన్, కూకట్‌పల్లి వై జంక్షన్‌లతో పాటు గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన వాటర్ లాగింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా డీసీపీ ట్రాఫిక్--2 శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., అదనపు డీసీపీ ట్రాఫిక్--2 వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్యలతో కలిసి జేఎన్‌టీయూ, కూకట్‌పల్లి వై జంక్షన్‌లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, వాహనాల రద్దీ, సిగ్నల్ నిర్వహణ, ట్రాఫిక్ ప్రవాహంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డీసీపీ ట్రాఫిక్--1 ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్--1 జి. హనుమంతరావుతో కలిసి గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌సీయూ గేట్ నెం.2, ఐఐఎల్ యూ-టర్న్ వద్ద ఉన్న ప్రధాన వాటర్ లాగింగ్ ప్రాంతాలను సందర్శించి, అక్కడ కొనసాగుతున్న సమస్యల పరిష్కార పనులను పరిశీలించారు.

ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న అంశాలను గుర్తించి, వాహనాల రాకపోకలు మరింత సాఫీగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు జాయింట్ సీపీ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించడం, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా, వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాటర్ లాగింగ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.



రాజస్థానీ సమాజ్ ప్రతినిధులు మరియు తెలంగాణ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ రవికుమార్ యాదవ్ గారితో కలిసి ఈరోజు సికింద్రాబాద్ రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే (SCR) జనరల్ మేనేజర్ గారిని కలవడం జరిగింది. ప్రజల సౌకర్యార్థం సికింద్రాబాద్ – బికనీర్ – హిసార్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 22737/22738)ను వారంలో అన్ని రోజులు (రోజువారీగా) నడపాలని, అలాగే ఈ రైలు సర్వీసును శేరిలింగంపల్లి స్టేషన్ వరకు పొడిగించాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని అందజేశాము. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది ప్రయాణికులకు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లాము.

# గోగన్నమఠం గ్రామంలో వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు..



రాజోలు (బిఎన్ఎస్ )జూలై 08 : రాజోలు నియోజకవర్గం గోగన్నమఠం గ్రామంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయంతి వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి, గ్రామంలోని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సంక్షేమ పాలనకు ఆయన ఆదర్శంగా నిలిచారని, ఆయన చూపిన బాటలోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తోందని అన్నారు.

# మహిళల ముంగిటకు కంబాల కానుక.. పల్లెల్లో పట్టుచీరల పండుగ

- **గురుపూజోత్సవ కానుకగా పాతిక వేల మంది మహిళా ఉపాధ్యాయులకు పట్టు వస్త్రాలు**



రాజమండ్రి (బిఎన్ఎస్ )జూలై 08 : రాజమండ్రి కేంద్రంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు మహిళా సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా మరో బృహత్తర కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. గడచిన మూడేళ్లుగా ఆషాఢ, శ్రావణ మాసాలను పురస్కరించుకుని పల్లెల్లోని మహిళలకు బంగారు ఆభరణాలు, కానుకలు అందిస్తున్న ఆయన, ఈ ఏడాది మరింత విస్తృతంగా పట్టుచీరల పంపిణీ చేపట్టనున్నారు. గతంలో లక్కీ డ్రా విధానం ద్వారా పదిహేను వేల నుంచి పాతిక వేల మందికి చీరలు అందజేయగా, ఈసారి ఆ పద్ధతికి స్వస్తి పలికారు. రాజానగరం, జగ్గంపేట, పోలవరం నియోజకవర్గాల పరిధిలో ఎంపిక చేసిన గ్రామాల్లోని ప్రతి మహిళకూ ఎలాంటి మినహాయింపులు లేకుండా పట్టుచీరను బహుమతిగా అందించాలని నిర్ణయించారు. ఈ శనివారం సీతానగరం, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో ఈ పంపిణీ మహాకార్యక్రమం లాంఛనంగా ప్రారంభం కానుంది. గ్రామంలో ఎంత మంది మహిళలు ఉంటే, అందరికీ ఈ కానుకలు అందజేయనున్నారు.

గతంలో చీరలు అందుకున్న మహిళల ముఖాల్లో కనిపించిన ఆనందమే తనను ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేసేలా ప్రేరేపించిందని ఆయన తెలిపారు. ఇటీవల అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన కంబాల శ్రీనివాసరావు, రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను అధికారికంగా వెల్లడించారు.

సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ వృత్తి పట్ల తనకున్న అమితమైన గౌరవాన్ని ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు చాటుకున్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులను కూడా ఈ కానుకల పంపిణీలో భాగస్వాములను చేశారు. ఎంపిక చేసిన గ్రామాలతో పాటు, సుమారు పాతిక వేల మంది మహిళా టీచర్లకు ప్రత్యేకంగా పట్టుచీరలు అందజేయనున్నట్లు ప్రకటించారు. సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయంగానూ చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయన, భారతీయ జనతా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా జగ్గంపేట నియోజకవర్గ బాధ్యతలను సైతం ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఆయన చేస్తున్న నిరంతర ప్రజాసేవను గుర్తించిన కాకినాడకు చెందిన పలు ఉపాధ్యాయ సంఘాలు, వచ్చే ఏడాది జరగనున్న ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన ముందు ప్రతిపాదన ఉంచాయి. దీనిపై స్పందించిన కంబాల, తాను క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తనని, ఎమ్మెల్సీ బరిలో దిగే విషయంపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం, అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయ సంఘాలకు సూచించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్య, వైద్యపరంగా అండగా నిలుస్తూ కంబాల శ్రీనివాసరావు తన సేవా యజ్ఞాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

# ఆపరేషన్ మొబీ ట్రాక్ పేరుతో కడపజిల్లాలో 12.67 కోట్ల విలువైన మొబైల్స్ రికవరీ..




కడపజిల్లా జూలై 08: ఆపరేషన్ మోబీ ట్రాకర్ ద్వారా కడపజిల్లా సైబర్ క్రైమ్ టీం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ నిఘా, మరియు డేటా విశ్లేషణ పద్ధతులు ఉపయోగించి భారీ మొబైల్ ఫోన్ రికవరీ ఆపరేషన్‌లో సఫలమయ్యారు.

కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా, 9వ విడతలో భాగంగా రికవరీ చేసిన 610 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ బాధితులకు తిరిగి అందజేశారు. వీటి విలువ సుమారు రూ. 1,22,00,000/- ఇప్పటి వరకు 9 విడతల్లో మొత్తం 12,67,50,000/- విలువైన 6487 మొబైల్ ఫోన్లు రికవరీ చేయబడ్డాయి అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నచ్చికేత్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అధునాతన డిజిటల్ టెక్నాలజీ జిపిఎస్ ఆధారంగా ఐఎంఈఐ ట్రేసింగ్, మరియు సైబర్ నిఘా టూల్స్

ఉపయోగించడం వల్లే ఈ ఆపరేషన్ విజయవంతమైందని, మొబైల్ రికవరీలో రాష్ట్రస్థాయిలోనే కడపజిల్లా అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. ఆపరేషన్ మోబీ ట్రాకర్ విజయవంతమైన ఆపరేషన్‌కు అధునాతన డిజిటల్ టెక్నాలజీ, జిపిఎస్ ట్రాకింగ్, ఐఎంఈఐ ట్రేసింగ్, మరియు సైబర్ నిఘా టూల్స్ కారణమని జిల్లా ఎస్పి తెలిపారు. జిల్లాలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం. వల్ల ఐఎంఈఐ ఆధారిత ట్రాకింగ్ మరియు డేటా అనలిటిక్స్ పద్ధతుల ద్వారా ఫోన్లు త్వరితగతిన రికవరీ చేశారు. మొబైల్ రికవరీ విషయంలో రాష్ట్ర స్థాయిలో కడపజిల్లా మంచి ప్రగతి సాధించినట్లు తెలిపారు.

సైబర్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసు వారు తెలుపుతూ.. అపరిచిత వీడియో కాల్స్, లేదా ఫిషింగ్ కాల్స్, ఇమెయిల్స్‌కు ప్రతిస్పందించ చేయొద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 లేదా సమీపంలో గల పోలీస్ స్టేషన్ సంప్రదించాలి లేదా ఎన్సిఆర్పి వెబ్సైట్ లో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో డిజిటల్ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించి ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ మధు, మల్లేశ్వర రెడ్డి, మరియు రికవరీ ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన కింది సిబ్బందిని ఎస్పీ నచ్చికేత్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

# ఎస్సీ మోర్చా రాష్ట్రవ్యాప్త కార్యాచరణను మరింత బలోపేతం చేయాలి

## : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

అమరావతి, జూలై 8: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ మోర్చా చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా దళిత సాధికారత, సామాజిక న్యాయం, అంబేద్కర్ ఆశయాల సాధన కోసం మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో దళితులను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. దళితుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ డప్పు కళాకారులు, వారి కళను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.




సామాజిక సామరస్యానికి భంగం కలిగించేలా, హిందూ ధర్మాన్ని అవమానించేలా, విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే, సంఘ విద్రోహ కార్యకలాపాలను ప్రోత్సహించే శక్తులను ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ, రాబోయే మూడు నెలల్లో చేపట్టనున్న కార్యక్రమాల కార్యాచరణను వివరించారు. దళిత సమాజంలోని అన్ని ఉపకులాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్, రాష్ట్ర పదాధికారులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# పదునైన పదజాలంతో మన వాణిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- విద్రోహ శక్తుల కుట్రలను తిప్పికొట్టాలి -- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులకు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



అమరావతి, జూలై 8: రాష్ట్రంలో బీజేపీని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో కార్యాచరణ రూపొందిస్తున్నామని, అధికార ప్రతినిధులు పదునైన పదజాలంతో పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

బీజేపీ అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టుల కోసం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్, తెలుగు--సంస్కృత భాషా కార్పొరేషన్ చైర్మన్ ఆర్.డి. విల్సన్ హాజరయ్యారు. వర్క్‌షాప్‌కు వల్లూరు జయప్రకాశ్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ఇది అధికార ప్రతినిధులకు నిర్వహిస్తున్న రెండో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ అని తెలిపారు. రాష్ట్రంలో విద్రోహ శక్తులు వివిధ రూపాల్లో పనిచేస్తున్నాయని, దళితవాదం పేరుతో కొత్త ముసుగులు ధరించి హిందూ దేవతలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

మతాల పేరుతో చిచ్చు పెట్టడం, బలవంతపు మత మార్పిడులకు ప్రోత్సాహం ఇవ్వడం వంటి చర్యలను సమాజం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో అన్ని మతాలను గౌరవించి, రక్షణ కల్పించిన దేశం భారతదేశమేనని, అయినప్పటికీ దేశంపై కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.

వాక్ స్వాతంత్ర్యం పేరుతో విమర్శలు చేయడం వేరు, విద్వేషాలు రెచ్చగొట్టడం వేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, ఉగ్రవాదానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం, సామాజిక విద్వేషాలను ప్రేరేపించడం అంగీకారయోగ్యం కాదన్నారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుంటూనే పరమతాలను గౌరవించాలని, కుట్రపూరితంగా మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చైనాలో భావ ప్రకటనా స్వేచ్ఛ లేదని పేర్కొంటూ కమ్యూనిస్టు విధానాలను విమర్శించారు.

మోదీ--చంద్రబాబు నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వేగం తీసుకొచ్చిందన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలో భారీ ప్రాజెక్టులు అమలవుతున్నాయని, మూడు గ్రీన్ కారిడార్లు, ఎకనామిక్ కారిడార్లు, సోలార్ విద్యుత్ విస్తరణ, గూగుల్ డేటా సెంటర్, స్టీల్ ప్లాంట్ వంటి పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్తును మార్చనున్నాయని చెప్పారు.

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని, వచ్చే ఎన్నికల నాటికి పోలవరం జలకళతో కళకళలాడుతుందని తెలిపారు. మచిలీపట్నం పోర్టు అభివృద్ధి, అమరావతి నిర్మాణం, కడప స్టీల్ ప్లాంట్ వంటి ప్రాజెక్టులతో రాష్ట్రానికి భారీ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రెండేళ్లలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని పేర్కొంటూ, అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను ప్రజలంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మంత్రి వై సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సానుకూల వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు కుల, మత విద్వేషాలను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. చట్ట పరిధిలో విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో సందేశాల ద్వారా కూడా విద్వేష ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు.

మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధం కావని తెలిసినా కొందరు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హిందూత్వ మూలాలను దెబ్బతీసేలా మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలు చేశారని, అమరావతి నుంచి మూడు రాజధానులు, ఇప్పుడు "మావిగన్" వంటి అసంబద్ధ వాదనలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి పార్టీలు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాయని, గ్రామీణ--పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధినే ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు. త్వరలో మూడు పార్టీల సమన్వయ సమావేశం నిర్వహించి అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ అధికార ప్రతినిధులు ప్రజా సమస్యలపై వాస్తవాధారితంగా స్పందించాలని, పార్టీ సిద్ధాంతాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

# 15వ తేదీన జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి..!!


## విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 08: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ,దువ్వూరు సెక్షన్ ఆఫీసు నందు స్ట్రగుల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నాయబ్ రసూల్ ఈ సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యం ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగుల దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చేపట్టామని వారు తెలిపారు. అందులో భాగంగా, ఈనెల 15 వ తేదీన ఎస్పిడిసిఎల్ ఆఫీసు, తిరుపతి వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైదుకూరు డివిజన్ ఉపాధ్యక్షులు ఎన్. వి రమణ మాట్లాడుతూ.., వేతన సవరణ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో ఉన్న 4 కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగులర్ చేయాలనీ, ఆయన డిమాండ్ చేశారు. డివిజన్ ఉపాధ్యక్షులు వరదా రెడ్డి, కృష్ణారెడ్డి మాట్లాడుతూ, డిస్కం పరిధిలోని పెండింగ్ లో వున్న ఉద్యోగుల కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. మైదుకూరు డివిజన్లో ఓ అండ్ ఎం కార్మికుల ప్రమోషన్లు వెంటనే కల్పించాలని వారు డిమాండ్ చేశారు. స్ట్రగుల్ కమిటీ డివిజన్ నాయకులు నరసింహ, శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. టాటా ఏఐజి పాలసీ చాలా అధ్వానంగా ఉందని ఈ పాలసీ మీద యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ అమలు చేయాలని, వారు డిమాండ్ చేశారు. చలో తిరుపతి కార్యక్రమానికి మైదుకూరు డివిజన్ లోని కాంట్రాక్టు మరియు రెగ్యులర్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు తెలియజేశారు. ఈ సమావేశంలో మైదుకూరు డివిజన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ సభ్యులు బి.సుబ్బారెడ్డి, రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణ తరహాలో 48 వేల రూపాయలు జీతం చెల్లించాలని ఆయన తెలిపారు. అపరిమిత మెడికల్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. షరతులు లేకుండ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జయసింహ, కృష్ణ చంద్రారెడ్డి, తాహిర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ హత్య కేసులో పోలీసుల తీరుపై విమర్శలు..

- ఏడాది మిస్సింగ్‌గా నమోదు చేసి, ఇప్పుడు హత్యగా తేల్చిన కేసు
- ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చిన హత్య కేసు
- ఆలస్యమైన దర్యాప్తుపై స్థానికులు, ప్రజా సంఘాల ఆగ్రహం



మియాపూర్ (బిఎన్ఎస్): మియాపూర్‌లో గత ఏడాది మిస్సింగ్‌గా నమోదైన ఓ కేసు ఇప్పుడు హత్య కేసుగా మారింది. భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి మహారాష్ట్ర సరిహద్దులో మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ఘటన ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చింది.

గత ఏడాది నవంబర్‌లో భర్త కనిపించడం లేదంటూ భార్య మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దీనిని మిస్సింగ్ కేసుగా నమోదు చేసినప్పటికీ, దర్యాప్తు ముందుకు సాగలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాది పాటు కేసులో కీలక పురోగతి లేకపోవడంతో అసలు నిజం బయటపడలేదు.

ఇటీవల కేసుపై అనుమానం రావడంతో పోలీసులు భార్య కాల్ రికార్డులు, సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఈ దర్యాప్తులో హత్య జరిగినట్లు బయటపడింది. భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి, మృతదేహాన్ని మహారాష్ట్ర సరిహద్దుకు తరలించి పూడ్చిపెట్టినట్లు పోలీసులు నిర్ధారించారు.

స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసిన అధికారులు, భార్యతో పాటు ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని సమాచారం.

# ఆలమూరు లో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి ఘనంగా నిర్వహణ



ఆలమూరు (బిఎన్ఎస్) జూలై 08: కోనసీమ జిల్లా కొత్తపేట నియోజక వర్గం మండల కేంద్రమైన ఆలమూరు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఆలమూరులో ఘనంగా నివాళు లర్పించారు.కోనసీమ జిల్లా వైసీపి అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్, కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలమూరు బస్టాండ్ దగ్గర ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి భారీ కేక్ కట్ చేసి అభిమాన నాయకుని మీద అభిమానం చాటు కొన్నారు. అనంతరం పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేయగా, రైతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వ పాలనలో ప్రధాన లక్ష్యంగా తీసుకుని ఉచిత విద్యుత్ అందించిన ఘనత ఆయనదేనని, ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చి వేలాది కుటుంబాలకు ప్రాణదాతగా నిలిచారని కొనియాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేశారని, 108 అంబులెన్స్, 104 వైద్య సేవలు, ఇందిరమ్మ గృహాలు, జలయజ్ఞం వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న మహానేతగా అభివర్ణించారు.పేదల బాధను తన బాధగా భావించి, రైతు ముఖంలో చిరునవ్వు చూడాలనే సంకల్పంతో పరిపాలన సాగించిన ప్రజానాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయాలు, సంక్షేమ పాలన నేటికీ ప్రజలకు స్ఫూర్తిదాయకమని, ప్రతి కార్యకర్త ఆయన సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

# మహానేతకు ఘన నివాళులు

## వైయస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు...



రాజమండ్రి రూరల్(బిఎన్ఎస్)జూలై 08 : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం లోని వైయస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల అధ్యక్షతన సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు... వైయస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలతో కలిసి వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ..అనంతరం కేక్ కట్ చేశారు...ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు చోట్ల నాయకులు ఏర్పాటు చేసిన వేడుకలకు హాజరయ్యారు తోలుత దవళేశ్వరం గ్రామంలోని పోలీస్ స్టేషన్ సెంటర్ నందు,బ్యారేజ్ సెంటర్ అనంతరం వేమగిరి జంక్షన్,కడియపులంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన వేడుకలలో పాల్గోన్నారు... ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా ప్రజల గుండెల్లో పదిలంగా నిలిచిపోయారని...వ్యవసాయశీ దండగ అనే పదం నుంచి వ్యవసాయాన్ని పండుగగా మార్చిన ఘనత వైయస్ రాజశేఖరరెడ్డి దని అన్నారు కరువుకు నిలయంగా ఉన్న రాయలసీమకు నేడు కృష్ణా జలాలు వస్తున్నాయంటే అది వైయస్ఆర్ చలవేనని అన్నారు. జలయజ్ఞం ద్వారా ఉమ్మడి ఏపీలో అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. తాగునీటి సమస్య సాగు నీటి సమస్యలు పరిష్కారం కోసం అనేక ప్రాజెక్ట్ లు నిర్మాణం చేపట్టి,రాజకీయశీగా కుల,మత,ప్రాశీతలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైయస్ఆర్ ఒక్కడికే దక్కిందని అన్నారు...తండ్రి అడుగుజాడల్లోనే వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణం కూడా కొనసాగుతోందని.. ఐదేళ్ల పాలన ప్రజారంజకంగా సాగిందని తెలిపారు. వైయస్ జగన్ నాయకత్వంలో వైయస్ఆర్ ఆశయాల సాధన కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని హర్షం వ్యక్తం చేశారు...

దేశానికే రోల్‌మోడల్‌గా సంక్షేమ పథకాలు..పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకున్న వైయస్ రాజశేఖరరెడ్డి 2004లో సీఎం అయ్యాక పేదల పక్షపాతిగా పరిపాలన సాగించారని...వైయస్ అంటే ఒక నమ్మకం.. ఒక భరోసా అని అన్నారు..పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారని గుర్తు చేశారు...పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు.

# వివాహం పేరుతో లైంగిక, ఆర్థిక దోపిడీ.. పాస్టర్‌పై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు..



అమలాపురం (బిఎన్ఎస్)జూలై 08 : వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దోపిడీకి పాల్పడటమే కాకుండా, మత విశ్వాసాన్ని దుర్వినియోగం చేసి దేవుని పేరుతో భయపెట్టి సుమారు రూ.8 లక్షలు, బంగారం కాజేశాడని ఆరోపిస్తూ కోనసీమ జిల్లాకు చెందిన ఓ మహిళ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

బాధితురాలు చంద్రాని తలుపులమ్మ తెలిపిన వివరాల ప్రకారం, నేదునూరు గ్రామానికి చెందిన కుంచె సురేష్ బాబు ఏ పాస్టర్ మనోహర్ తనను క్రైస్తవ మత పాస్టర్‌గా పరిచయం చేసుకుని, ప్రార్థనల పేరుతో విశ్వాసం సంపాదించి, "నిన్ను వివాహం చేసుకుంటాను" అని నమ్మించాడని ఆరోపించారు. అనంతరం "నా మాట వినకపోతే దేవుడు శిక్షిస్తాడు", అంటూ మత విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని తనలో తీవ్రమైన భయాన్ని కలిగించి, స్వేచ్ఛాయుత సమ్మతిని దెబ్బతీసే విధంగా అనేకసార్లు లైంగిక సంబంధాలు పెట్టుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆ తర్వాత వివాహం చేసుకోకుండా మోసం చేశాడని, వివాహం గురించి ప్రశ్నిస్తే తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని, వ్యక్తిగత వీడియోలు బయటపెడతానని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తానని బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ చేశాడని ఆరోపించారు.

ఈ బెదిరింపుల మధ్య తన వద్ద నుంచి దశలవారీగా సుమారు రూ.8 లక్షల నగదు తీసుకున్నాడని, తన నెల జీతం రూ.12,000ను దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు తీసుకున్నాడని, పిల్లల కోసం దాచుకున్న పొదుపు మొత్తాన్ని కూడా కాజేశాడని బాధితురాలు తెలిపారు . మోటార్ సైకిల్ కొనుగోలు కోసం కూడా తన వద్ద నుంచి డబ్బు తీసుకున్నట్లు అన్నారు. అలాగే 2023 సెప్టెంబర్ 10న తన 15.1 గ్రాముల నల్లపూసల బంగారు గొలుసును అమలాపురంలోని ఇండియన్ బ్యాంకులో తాకట్టు పెట్టించి డబ్బు తీసుకున్నాడని ఆమె ఆరోపించారు.జూన్ 2026లో మారణాయుధాలతో వచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేసినా లేదా తన గురించి ఎవరికైనా చెప్పినా చంపేస్తానని బెదిరించాడని, ప్రస్తుతం తాను తన పిల్లలు తీవ్ర ప్రాణభయంతో జీవిస్తున్నామని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై ఇప్పటికే అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని , ఇప్పుడు రాష్ట్ర మహిళా కమిషన్ జోక్యం చేసుకుని నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని, తనకు మరియు తన పిల్లలకు రక్షణ కల్పించాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

తన వద్ద బ్యాంకు లావాదేవీల వివరాలు, ఇండియన్ బ్యాంకు గోల్డ్ లోన్ పత్రాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, కాల్ రికార్డులు, చాట్ సందేశాలు, వివాహ ఫోటోలు ఇతర ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు సమయంలో వాటిని సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఫిర్యాదులో నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 69 (వివాహం చేస్తానని తప్పుడు హామీ ఇచ్చి లైంగిక సంబంధం), సెక్షన్ 308 (మోసం), సెక్షన్ 318 (మోసపూరిత చర్యల ద్వారా అక్రమ లాభం), సెక్షన్ 351 (క్రిమినల్ బెదిరింపులు) మరియు సెక్షన్ 354 (బెదిరింపుల ద్వారా ఆస్తి లేదా డబ్బు పొందడం వంటి ఆరోపణలకు సంబంధించిన నిబంధనలు), అలాగే 358 BNS దేవుడు పేరు చెప్పి బెదిరించి లోబర్చుకోవడం. ఇతర వర్తించే నిబంధనల కింద కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని కోరినట్లు తెలిసింది...

# రాజీయే రాజమార్గం... వివాదాలకు ముగింపు... సంబంధాలకు కొత్త ఆరంభం.



పి. గన్నవరం (బిఎన్ఎస్)జూలై 08: కోనసీమ జిల్లా పి.గన్నవరం సర్కిల్ జూలై 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అని పి.గన్నవరం సి.ఐ పిలుపు నిచ్చారు. కేసుల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఇరు పక్షాలకు వివరించి, పరస్పర అవగాహన, చర్చలు, రాజీ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశామన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి కోర్టు ఫీజులు లేకుండా, తక్కువ సమయంలో, సామరస్యపూర్వకంగా వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందే అవకాశం ఉందని తెలిపారు.

ప్రజలు ఈ విలువైన అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలి అన్నారు.

# పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 08: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77 వ జయంతి సందర్భంగా కమలాపురం పార్టీ

కార్యాలయం నందు వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు.మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు.

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేరు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం వైయస్సార్ అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, సాగునీటి రంగాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పనిచేసిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముందుకు తీసుకెళున్నారని చెప్పారు. వైఎస్సార్ సంక్షేమ పాలనను మరోసారి రాష్ట్రంలో తీసుకురావాలంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేసి ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు.

అనంతరం కమలాపురం రైల్వే స్టేషన్ లో గతం లో నిలుపుతున్న అన్నీ రైళ్లు నిలపాలని స్టేషన్ మాస్టర్ కు వినతిపత్రం అందజేసారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు బ్రెడ్ పంపిణి చెసారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.